క్లుప్తంగా

ఇంట్రాజోన్ పోటీల్లో విద్యార్థుల సత్తా



విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

మీర్‌పేట: భాష్యం ఇంట్రాజోన్ స్పోర్ట్స్ మీట్‌లో మీర్‌పేట భాష్యం పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని ఛాంప్స్ ప్రిన్సిపాల్ శృతి తెలిపారు. ఈ నెల 28, 29 తేదీల్లో మీర్‌పేటలో జరిగిన పోటీల్లో జోన్‌–3 పరిధిలోని అన్ని పాఠశాలల విద్యార్థులు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, షటిల్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనగా, మీర్‌పేట విద్యార్థులు కబడ్డీ, షటిల్, వాలీబాల్‌లో ప్రతిభ కనబరిచి విజయం సాధించారని ఆమె చెప్పారు. ఈ సందర్భంగా గురువారం విజేతలకు సీఈఓ చైతన్య, జోనల్ ఇన్‌చార్జి అంకమరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మీర్‌పేట ప్రిన్సిపాల్ స్రవంతి పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి నిధుల మంజూరు

కందుకూరు: కందుకూరు, మహేశ్వరం మండలాల్లోని వివిధ గ్రామాల రోడ్ల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ ప్రత్యేక చొరవతో రూ.5.93 కోట్ల నిధులు మంజూరయ్యాయని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహేశ్వరం మండలంలోని సుభాన్‌పూర్ నుంచి కేకే బస్తీ వరకు రూ.1.05 కోట్లు, మాణిక్యమ్మగూడ నుంచి నల్లచెరువుతండా వరకు రూ.55.68 లక్షలు, కందుకూరు మండలంలో పీడబ్ల్యూడీ రోడ్ పోతుబండతండా నుంచి ముచ్చర్ల, ఊట్లపల్లి, పోచమ్మతండా వరకు రూ.2.72 కోట్లు, లేమూరు నుంచి తిమ్మాపూర్ వరకు రూ.1.60 లక్షల నిధులు రీబీటీ కోసం మంజూరయ్యాయన్నారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న కేఎల్‌ఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజల తరఫున ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఆయనతో మాజీ వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల కోఆర్డినేటర్ అఫ్జల్‌బేగ్, నాయకులు ఉన్నారు.

వేతనాలు అందక ఇబ్బంది



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధిహామీ ఉద్యోగులు

కందుకూరు: మూడునెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ ఉపాధిహామీ పథకం ఉద్యోగులు గురువారం ఎంపీడీఓ సరితకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఉద్యోగులు పాల్గొన్నారు.

పనులు త్వరితగతిన పూర్తిచేయాలి



అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే

మీర్‌పేట: కార్పొరేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం మీర్‌పేట మంత్రాల చెరువు, పెద్ద చెరువు వద్ద జరుగుతున్న క్రీడా ప్రాంగణ పనులను అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఈ సందర్భంగా సూచించారు. అంతకుముందు క్యాంపు కార్యాలయం వద్ద నలుగురు దివ్యాంగులకు బ్యాటరీతో నడిచే ట్రై సైకిళ్లను అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ జ్ఞానేశ్వర్, డీఈ వెంకన్న, ఏఈ శ్రీనివాసులు, స్థానిక నాయకులు తీగల విక్రంరెడ్డి, అర్కల భూపాల్‌రెడ్డి, దీప్‌లాల్‌చౌహాన్, దోమలపల్లి రాజ్‌కుమార్, దిండు భూపేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ మోహన్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 11కేవీ లెక్చరర్స్‌కాలనీ, మదర్‌డెయిరీ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. 11కేవీ లక్ష్మీనగర్, ఫణిగిరికాలనీ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

త్వరలో బస్‌స్టేషన్‌ను ప్రారంభిస్తాం

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ప్రయాణికుల అవసరాలకు అనుకూలంగా చేవెళ్లలో బస్‌స్టేషన్ నిర్మాణం జరిగిందని, త్వరలోనే ప్రారంభించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన స్థానిక నాయకులతో కలిసి నూతనంగా నిర్మించిన బస్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా బస్‌స్టేషన్ ఆవరణ మొత్తం తిరిగి సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల బస్‌స్టేషన్ నిర్మాణానికి హెచ్‌ఎండీఏ నుంచి రూ.6కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులు మంజూరు చేసిన హెచ్‌ఎండీఏకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పనులు చివరి దశకు చేరుకున్నాయని, త్వరలోనే బస్‌స్టేషన్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రజల అవసరాలకు తగిన విధంగా ఉండేలా నూతన బస్‌స్టేషన్ నిర్మాణం చేపట్టామన్నారు. ముందు భాగంలో ఉన్న పాత బస్‌స్టేషన్‌ను తొలగిస్తే బాగుంటుందని అధికారులకు సూచిస్తే, దీనిపై వారు తమకు ఆదేశాలు లేవని చెప్పటంతో దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడుతానన్నారు. త్వరలోనే ప్రారంభించేందుకు కృషి చేస్తామన్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండు, మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి. జిల్లా పార్టీ నాయకుడు ఆగిరెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.



బస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, స్థానిక నాయకులు

అభివృద్ధి పనులపై ఆరోపణలు మానుకో

ఎమ్మెల్సీకి కాంగ్రెస్ నేతల హెచ్చరిక

కొత్తూరు: షాద్‌నగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హయాంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై రాజకీయ ఆరోపణలు మానుకోవాలని మండల కాంగ్రెస్ నేతలు బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డిని హెచ్చరించారు. ఇటీవల ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడిన తీరును వ్యతిరేకిస్తూ నాయకులు గురువారం పట్టణంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డితో పాటు మున్సిపాలిటీ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ మాట్లాడుతూ.. మొగిలిగిద్ద, చించోడు గ్రామాలను కొత్త మండలాలుగా ప్రకటిస్తే రూ.2కోట్లు ఇస్తానని ఎమ్మెల్సీ ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తన సొంత మండలం నందిగామ అభివృద్ధిని పట్టించుకోని ఆయన కొత్త మండలాలు, నియోజకవర్గ అభివృద్ధిపై మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. పేద విద్యార్థుల ప్రయోజనాల కోసం ఎమ్మెల్యే దాతల సహకారంతో కళాశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. కాగా కళాశాల నిర్మాణానికి ఎలాంటి సాయం చేయని ఎమ్మెల్సీ దాతల సాయంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకోవడానికి ప్రయత్నాలు చేస్తామంటే కాంగ్రెస్ నేతలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. మరోమారు ఎమ్మెల్సీ నిజాలు తెలుసుకోకుండా నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కడ్రొళ్ల సురేందర్, వీరమోని దేవేందర్, శివకుమార్‌గౌడ్, జనార్ధన్‌చారి, చిల్కమర్రి నర్సింహ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

చేవెళ్ల ఎంపీటీసీ స్థానాలపై నోటిఫికేషన్ విడుదల

చేవెళ్ల: చేవెళ్ల మండలంలో గతంలో 17 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. మున్సిపాలిటీ ఏర్పాటుతో మండలంలో ఉన్న జనాభా ప్రతిపాదికన 12 ఎంపీటీసీ స్థానాలకు తగ్గుతున్నాయని, దీనికి సంబంధించిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేశామని ఎంపీడీఓ హిమబిందు తెలిపారు. గురువారం ఈ డ్రాఫ్ట్ నోటిపికేషన్ విడుదల చేసిన ఆమె దీనిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. డ్రాఫ్ట్ నోటిఫికేషన్ 30న విడుదల చేశామని, వీటిపై 31న అభ్యంతరాల స్వీకరణ, ఫిబ్రవరి 1, 2లలో పరిశీలన, 3వ తేదీ ఫైనల్ జాబితాను ప్రకటించనున్నట్లు తెలిపారు.

అభ్యంతరాలుంటే చెప్పండి

కొత్తూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో కొత్తగా ప్రతిపాదించిన ఎంపీటీసీల స్థానాలు, గ్రామాల పరిమితులపై అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ అరుంధతి గురువారం తెలిపారు. కొత్తూరు మున్సిపాలిటీ ఏర్పడకముందు మండలంలో 10 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. ప్రస్తుతం 6 స్థానాలు ఉన్నట్లు వివరించారు. గూడూరు ఎంపీటీసీ పరిధిలో గూడూరు, మక్తగూడ, మల్లాపూర్‌తాండ గ్రామాలు, తీగాపూర్ ఎంపీటీసీ పరిధిలో గ్రామాలు ఉన్నాయని, 31న అభ్యంతరాల స్వీకరణ, 1, 2న అభ్యంతరాల పరిష్కరణ, 3న తుది జాబితా ప్రకటించనున్నట్లు తెలిపారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

షాబాద్: ప్రభుత్వ పథకాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన 34 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, ఏడుగురికి సీఎం సహాయనిధి చెక్కులను వారు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, ఎంపీడీఓ అపర్ణ, తహసీల్దార్ కృష్ణయ్య, డిప్యూటీ తహసీల్దార్ మధు, మాజీ సహకార సంఘం చైర్మన్ చాల్లా రాంరెడ్డి ఉన్నారు.

ఎంపీటీసీ స్థానాలపై ముసాయిదా ప్రచురణ

మహేశ్వరం: మహేశ్వరం మండలంలోని 13 ఎంపీటీసీ స్థానాలకు పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ ఆదేశానుసారం ముసాయిదాను గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శైలజ ప్రచురించారు. మండలంలోని 13 ఎంపీటీసీ స్థానాలు మహేశ్వరం–1, మహేశ్వరం–2, మహేశ్వరం–3, సిరిగిరిపురం, తుమ్మలూరు, మన్సాన్‌పల్లి, కోళ్లపడకల్, సుభాన్‌పూర్, మాణిక్యమ్మగూడ, కల్వకోల్, అమీర్‌పేట్, గొల్లూరు, నాగారం ఎంపీటీసీ స్థానాలున్నాయి. ఇదివరకు హర్షగూడ ఎంపీటీసీ స్థానం ఉండేది దాని కింద హర్షగూడ, సిరిగిరిపురం, గంగారం గ్రామ పంచాయతీలు ఉండేవి. ఇటీవల హర్షగూడ గ్రామ పంచాయతీ తుక్కుగూడ మున్సిపాలిటీలోకి వెళ్లడంతో సిరిగిరిపురం, గంగారం రెండు గ్రామ పంచాయతీలను కలిసి సిరిగిరిపురం పేరుతో ఎంపీటీసీ స్థానం ఏర్పాటు చేశారు. ముసాయిదా ప్రచురణపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు తెలియజేయాలని కోరారు. ఫిబ్రవరి 3వ తేదీన తుది ప్రచురణ ప్రకటిస్తామని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ముసాయిదా ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ శైలజ

విజేతలకు బహుమతుల ప్రదానం

కందుకూరు: యువతను సన్మార్గంలో నడిపించే శక్తి క్రీడలకు ఉందని, అందరూ తప్పకుండా క్రీడల్లో పాల్గొనాలని ఎంఈఓ నర్సింహ పిలుపునిచ్చారు. ఏబీవీపీ కందుకూరు శాఖ ఆధ్వర్యంలో ఖేలో భారత్‌లో భాగంగా మండల కేంద్రంలోని చైతన్య పాఠశాల ప్రాంగణంలో చేపట్టిన క్రీడాపోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాగా మొత్తం 15 పాఠశాలల నుంచి జట్లు పోటీపడ్డాయి. కబడ్డీ, వాలీబాల్, కోకో పోటీల్లో మొదటి బహుమతిని పులిమామిడి జిల్లా పరిషత్ పాఠశాల జట్లు దక్కించుకున్నాయి. టగ్‌–ఆఫ్‌–వార్ పోటీలో మొదటి బహుమతిని నోబుల్ స్కూల్, రెండో బహుమతిని నేదునూరు మోడల్ స్కూల్ జట్లు గెలుపొందాయి. వారికి ఎంఈఓ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కందడి శ్రీరామ్, బీజేపీ జిల్లా నాయకుడు సాధ మల్లారెడ్డి, ఏబీవీపీ నాయకులు వెంకటేష్, భానుప్రసాద్, జ్యోతిప్రసాద్, అమరేందర్, మానికుమార్, అభిరామ్, చందు, జగన్, ఢిల్లీ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓ, నాయకులు

కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్‌కు సన్మానం



నర్సింహను సన్మానిస్తున్న అనాథాశ్రమం మహిళలు, బాలికలు

మహేశ్వరం: కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా కోళ్లపడకల్ గ్రామానికి చెందిన నందిగామ నర్సింహను చైతన్య మహిళా మండల అనాథశ్రమం ఆధ్వర్యంలో మహిళలు, అనాథలు గురువారం ఘనంగా సన్మానించారు. నందిగామ నర్సింహ కాంగ్రెస్ పార్టీలో సామాన్య కార్యకర్తగా కష్టపడి ఈ రోజు కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా నియమితులు కావడం గర్వకారణమని ఆశ్రమ నిర్వాహకులు కోరారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని కోరారు. సామాజిక సేవలో ముందుండాలని వారు నర్సింహకు సూచించారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని నర్సింహ పేర్కొన్నారు. అంతకు ముందు ఆశ్రమ నిర్వాహకులు, అనాథలు, మహిళలు ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో మహిళా మండలి అనాథశ్రమం నిర్వాహకులు జయసింగ్, థామస్, పలువురు అనాథలు పాల్గొన్నారు.



లిక్కి మమత కృష్ణారెడ్డి దంపతులను సన్మానిస్తున్న కాలనీ మహిళలు

అనుకున్న లక్ష్యాన్ని పూర్తిచేశా

- ఆదరించిన డివిజన్ వాసులకు కృతజ్ఞతలు
- మాజీ కార్పొరేటర్ లిక్కి మమత

బడంగ్‌పేట్: తనకు ఇచ్చిన 5 ఏళ్ల కాలంలో అనుకున్న లక్ష్యం కంటే ఎక్కువగానే సాధించానన్న తృప్తి ఉందని, ఆదరించిన డివిజన్‌లోని పలు కాలనీ వాసులకు 22వ డివిజన్ మాజీ కార్పొరేటర్ లిక్కి మమత ధన్యవాదాలు తెలిపారు. గురువారం డివిజన్‌కు చెందిన శివనారాయణపురం కాలనీకి చెందిన మహిళలు మాజీ కార్పొరేటర్ లిక్కి మమత కృష్ణారెడ్డి దంపతులను ఘనంగా సన్మానించి, స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా వరదలు వచ్చినప్పుడల్లా శివనారాయణపురం, సాయిప్రభ హోమ్స్, సాయిరాం కాలనీలు వరద ముంపునకు గురై ఆస్తినష్టంతో పాటు అనేక ప్రమాదాలు జరగగా.. తాను కార్పొరేటర్‌గా గెలిచిన వెంటనే నష్టపోయిన 333 కుటుంబాలకు ప్రతీ ఇంటికి పదివేల చొప్పున నష్టపరిహారం ఇప్పించానని తెలిపారు. వారందరి శాశ్వత పరిష్కారానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రోత్సాహంతో ఎస్ఎన్‌డీపీ నాలా మంజూరి చేయించి సమారు రూ.10 కోట్లు వెచ్చించి పనులు పూర్తి చేయించామని పేర్కొన్నారు. రూ.7.39 కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాళ్లు, వాటర్‌లైన్లు, వీధి దీపాలతో పాటు మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. రోజు విడిచి రోజు తాగునీరు వచ్చేలా చర్య లు తీసుకున్నాం. హైటెన్షన్ వైర్ల కింద ఉన్న ఇళ్లకు ప్రమాదాలు జరుగకుండా బంచ్ కేబుల్ వేయించామన్నారు. తనను గెలిపించి అండగా ఉన్నా అన్ని కాలనీవాసులకు, మహిళలకు, డివిజన్ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అభివృద్ధికి సహకారం అందించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, మేయర్, డిప్యూటీ మేయర్, సహచర కార్పొరేటర్లు, అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

గాంధీజీకి నివాళి

కందుకూరు: మండల పరిధిలోని నేదునూరులో మహాత్మాగాంధీ 77వ వర్ధంతిని పురస్కరించుకొని గ్రామస్తులు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ జీ.శమంతప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల కో–ఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, నాయకులు బొర్ర సురేష్, గాంధీ యూత్ అధ్యక్షుడు నీరటి నాగరాజు, మాజీ వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



నేదునూరులో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏ అమలు చేయాలని వినతి

షాద్‌నగర్‌రూరల్: మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెంచిన హెచ్‌ఆర్‌ఏను అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు 13శాతం హెచ్‌ఆర్‌ఏను అమలు చేయాలని కోరుతూ నాయకులు ఆర్డీఓ సరితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపాలిటీ పరిధిల్లో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు 13శాతం హెచ్‌ఆర్‌ఏను ఇస్తున్నారని, షాద్‌నగర్ పరిధిలో ఆ ఉత్తర్వులు అమలు కావడంలేదన్నారు. షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోనూ అమలు చేసేందుకు చర్యలు తీసేకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నర్సింలు, సత్యం, తిరుమలయ్య తదితరులు ఉన్నారు.

హామీల అమలులో విఫలం



తుక్కుగూడ: రావిర్యాలలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



బడంగ్‌పేట్‌లో..

- కాంగ్రెస్ వైఫల్యాలపై బీఆర్‌ఎస్ నాయకుల నిరసన
- గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు వినతిపత్రాల అందజేత

తుక్కుగూడ: రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైనందని మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్యయాదవ్ అన్నారు. గురువారం పుర పరిధిలోని రావిర్యాల గ్రామంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోకి అధికారంలోకి వచ్చి 420 రోజుల్లో 420 హామీలను అమలు చేయలేదన్నారు. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సుమన్, లావణ్య, నాయకులు సురేష్, శ్రీలత, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభాకర్, రమేష్, నాగేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్‌లో..

బడంగ్‌పేట్: బడంగ్‌పేట్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన 420 హామీలను నెరవేర్చేలా చూడాలని బాపూజీకి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో అర్జున్, అనంద్‌రెడ్డి, బి.జంగారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, లిక్కి కృష్ణారెడ్డి, శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

మీర్‌పేట: ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తోందని మీర్‌పేట బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి ఆరోపించారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం మీర్‌పేట చందన చెరువు వద్ద గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎంకు బుద్ధి ప్రసాదించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అర్కల భూపాల్‌రెడ్డి, తీగల విక్రంరెడ్డి, దీప్‌లాల్ చౌహాన్, రజాక్, బొక్క రాజేందర్‌రెడ్డి, భూపేశ్‌గౌడ్, సిద్దాల భరత్, లక్ష్మణ్ ముదిరాజ్, బలరామకృష్ణ, విజయలక్ష్మి, సునీత బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

కందుకూరు: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ గురువారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మీర్‌ఖాన్‌పేట, బేగంపేట గ్రామాల్లోని గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి వినతిపత్రాలు అందించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, సీనియర్ నాయకులు కాకి దశరథ, మాజీ సర్పంచ్‌లు బ్రాహ్మణపల్లి జ్యోతిశేఖర్, గోవర్ధన్, గీతేశ్వరిగణేష్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కాకి రాములు, నాయకులు పాల్గొన్నారు.

ఏ ఒక్క హామీ నెరవేర్చలేదు

మహేశ్వరం: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 420 రోజులైనా ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను ఏ ఒక్కటి నెరవేర్చలేదని పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు యాదవ్, వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు వినతిపత్రాలు అందజేశారు. అధికార కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టినా బీఆర్‌ఎస్ ప్రజల పక్షాన పోరాతుతుందన్నారు. అంతకుముందు మహేశ్వరం, నాగారం, దుబ్బచర్ల గ్రామాల్లో గాంధీ విగ్రహాలను బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు హన్మగళ్ల చంద్రయ్య, నాయకులు పాల్గొన్నారు.



మీర్‌పేట: మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



మహేశ్వరం: దుబ్బచర్లలో..